## క్లుప్తంగా

### 29న పశువులు, కోళ్ల ప్రదర్శన

యానాం: పశుగణాభివృద్ధి, పశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 29న పశువులు, కోళ్ల ప్రదర్శన యానాం పశువుల ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్టు బుధవారం వైద్యాధికారి డాక్టర్ వి.కొమారణి ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేలు రకపు జాతి ఆవులు, గేదెలు, పెయ్యలు, మేకలు, గొర్రెలు, అదేవిధంగా కోళ్లు, మేలు రకపు జాతి కుక్కలు ప్రదర్శించేందుకు అనుమతించినట్టు తెలిపారు. యానాం ప్రాంతంలో పశుపోషకులందరూ పశుపునరుత్పత్తి పుస్తకాలను తీసుకుని రావాలని, 6 నెలల వయస్సు ఉన్న పెంపుడు కుక్కల యజమానులు ×రాబిస్ వేక్సినేషన్॥ వేయించిన కార్డులు చూపించాలని కోరారు. ఆ రోజు ఉదయం నుంచి పశువుల నమోదు ప్రక్రియ, అనంతరం బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు.

### తపాలా ఏజెంట్ల నియామకానికి 30న ఇంటర్వ్యూలు

అమలాపురం టౌన్: స్థానిక సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 30న తపాలాశాఖలో డైరెక్ట్ ఏజెంట్ల నియామక ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 27న కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థుల కనీసం వయస్సు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు మొదలవుతాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్‌ఎస్‌సీ/కేవీపీ) రూపంలో రూ.5 వేల విలువైన భద్రతా డిపాజిట్ చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ భద్రతా డిపాజిట్ తిరిగి చెల్లించే ప్రాతిపదికన ఉంటుందని తెలిపారు. ఎంపికైన డైరెక్ట్ ఏజెంట్లు వారి పొందిన బిజినెస్ ఆధారంగా ప్రోత్సాహకపు గౌరవ వేతనం/కమిషన్ ఇచ్చే వెసులబాటు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9494928199 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: స్థానిక సబ్‌స్టేషన్‌లోని 11 కేవీ ఫీడర్స్ పరిధిలోని చెట్ల కొమ్మలు కట్ చేస్తున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాళ్లరేవు మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్స్ పరిధిలోని గ్రామాలైన తాళ్లరేవు, సీతారామపురం, కోరంగి, గాడిమొగ, భైరవపాలెం, ఇండస్ట్రీలు ఆక్వా ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

### డయేరియాపై అప్రమత్తత అవసరం

యానాం: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అతిసారవ్యాధి డయేరియా పట్ల ప్రజల్లో అప్రమత్తత అవసరమని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యులతో ఆయన డయేరియా నివారణపై సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాల్లోను, మున్సిపాలిటీ పరిధిలోవార్డుల్లోను డయేరియా లక్షణాలు తదితర వాటి గురించి వివరించాలని ఈగలు–కీటకాలు ముసిరే ఆహార పదార్థాలను తీసుకోరాదని, కలుషిత ఆహారాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, ట్రైనీ ఐఏఎస్ బుద్ధి అఖిల్, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, జీజీహెచ్ ఏడీ సన్యాల్, పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రేపు స్టేట్‌హుడ్ కోసం నిరసన

యానాం: పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టడానికి బుధవారం పలు సామాజిక సంస్థల ప్రతినిధులు న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా స్వతంత్ర శాసన సభ్యుడు నెహ్రూ అలియాస్ కుప్పుస్వామి మాట్లాడుతూ పుదుచ్చేరి రైల్వేస్టేషన్ నుంచి సుమారు 150 మంది రైలులో ఢిల్లీకి బయలుదేరినట్లు, రాష్ట్రహోదా డిమాండ్ చేస్తూ జరుగుతున్న నిరసనలో పాల్గొనడానికి మరో 50 మంది విమానంలో బయలుదేరారన్నారు.

### పరశురాముడుకి పరామర్శ



పరశురాముడును పరామర్శించిన కిమ్స్ చైర్మన్ సత్యనారాయణ రాజు

అమలాపురం రూరల్: కిమ్స్ హాస్పిటల్‌లో గుండె సంబంధించిన సమస్యతో చికిత్స పొందుతున్న రాష్ట్ర మాలమహానాడు నాయకుడు పెయ్యల పరశురాముడుని మాజీ శాసన మండలి సభ్యులు, కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చైతన్యరాజు వెంట సురేష్ కిమ్స్ ఉద్యోగులు ఉన్నారు.

# వంతెన నిర్మించరు.. పూడిక తొలగించరు..

- వేసవి ముగిసినా పూర్తి కాని ఇంజరం వంతెన నిర్మాణం
- రైతులకు తప్పని సాగునీటి కష్టాలు
- తూరల వద్ద పేరుకుపోతున్న చెత్త
- శివారు ప్రాంతాలకు చేరని సాగునీరు
- ఖరీఫ్ పంట ఆలస్యం
- తక్షణమే వంతెన నిర్మించాలని రైతుల డిమాండ్



శిథిలావస్థకు చేరిన ఇంజరం వంతెన

తాళ్లరేవు: ఇంజరం వంతెన శిథిలమై ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి మాత్రం నోచుకోవడంలేదు. మూడు నెలల్లో నిర్మిస్తాం, ఆరు నెలల్లో నిర్మిస్తాం అంటూ పాలకులు చెపుతున్న మాటలు కార్యరూపం దాల్చడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలల్లో ఇంజరం వంతెనను నిర్మిస్తామంటూ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రకటించారు. అయితే ఏడాది గడుస్తున్నా ఇంత వరకూ ఊసే లేదు. దీంతో అటు ప్రయాణికులు ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వందేళ్ల క్రితం బ్రిటీషు వారు నిర్మించిన ఈ వంతెన శిథిలం కావడంతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. అదే రైతులపాలిట శాపంగా మారింది.

**ఖరీఫ్ పంటకు ఆలస్యం**

కాలువలకు సాగునీరు విడుదల చేసి పది రోజులు గడుస్తున్నా ఇంకా శివారు ప్రాంతాలకు చేరలేదు. యానాం – ద్రాక్షారామా రహదారిలో ఇంజరం వద్ద పంట కాలువపై ఉన్న వంతెన శిథిలమవడంతో వంతెన పక్కనే తాత్కాలికంగా తూరలతో కల్వర్టు నిర్మించారు. సాగునీరు వెళ్లేందుకు భారీ తూరలను వేసినప్పటికీ తూరల వద్ద చెత్త చెదారాలు పేరుకుపోయి నీరు పారని దుస్థితి నెలకొంది. ఈ కారణంగా పంట ఆరంభంలోనే నిర్ణీత సమయంలో ఆకుమడులు పడక, వరినాట్లకు ఆలస్యం అవుతుంది. తద్వారా ఏడాదికి మూడు పంటలు పండే భూముల్లో రెండు పంటలు పండించడం కూడా గగనంగా మారింది. ప్రతి రైతు ఏడాదికి మూడు పంటలు పండించాలని ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మూడు పంటల మాట ఎలా ఉన్నా రెండు పంటలు పండించడమే కష్ట సాధ్యంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంజరం కల్వర్టు వద్ద పేరుకుపోయిన చెత్త



కాలువ నుంచి తొలగించిన వ్యర్థాలు

**రెండు వేల ఎకరాలపై తీవ్ర ప్రభావం**

ఇంజరం వంతెన నిర్మించకపోవడంతో ప్రతి ఏడాది రెండు వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం కలుగుతోంది. ఇంజరం వంతెన వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టుల వద్ద భారీగా వ్యర్థాలు పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు పారడంలేదు. వ్యర్థాలను ప్రతిరోజూ తొలగించకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరందక ఖరీఫ్, రబీ పంటల్లో సైతం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జీపేట, నీలపల్లి, గాడిమొగ ప్రాంతాల్లోని శివారు భూములకు నీరు అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ కాలువల పరిధిలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరిపంట సాగు చేస్తుండగా సుమారు రెండు వేల ఎకరాలకు పైగా నీటి ఎద్దడి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు. నీటి ఎద్దడి కారణంగా ఏటా ఎకరాకు రూ. 5వేల నుంచి రూ.8వేల వరకు అదనపు భారం పడుతుందని, తమ సమస్యలన్నింటికీ ప్రధాన కారణమైన ఇంజరం వంతెనను తక్షణమే నిర్మించి పూర్తిస్థాయిలో సాగునీరు అందేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణమే వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

**వంతెన నిర్మించాలి**



ఇంజరం వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక తూరల కల్వర్టు వద్ద చెత్త చెదారాలు పేరుకుపోవడంతో పూర్తిస్థాయిలో నీరు పారక శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. దీంతో సాగుకు జాప్యం జరుగుతోంది. ముఖ్యంగా ఖరీఫ్‌లో పంట ఆలస్యం కావడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతోంది. వేసవిలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. దాళ్వా సాగులో వరి పంట చేతికి వచ్చే సమయంలో ఈ సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి తక్షణమే ఇంజరం వంతెన నిర్మాణాన్ని పూర్తిచేయాలి.

–వల్లు రాజబాబు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

**ప్రతిపాదనలు పంపించాం**

ఈ సమస్యపై రహదారులు భవనాల శాఖ జేఈ వి.లక్ష్మీ ప్రసన్నను వివరణ కోరగా వంతెన నిర్మాణానికి సంబంధించి రూ. 3 కోట్ల వ్యయంతో ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, డిజైన్స్ అండ్ ప్లానింగ్ అనుమతులు వచ్చిన తరువాత టెండర్‌లు పిలుస్తామని తెలిపారు.

# జగన్‌ను కలిసిన నాయకులు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌ను అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజక వర్గాల పార్టీ కో ఆర్డినేటర్లతో తాడేపల్లిలో జరిగిన సమావేశానంతరం జగన్‌ను డాక్టర్ శ్రీకాంత్ కలిసి కొద్దిసేపు మాట్లాడారు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పందిరిపల్లి రాజేష్

తాళ్లరేవు: ముమ్మిడివరం నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి పందిరిపల్లి రాజేష్ బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసినట్టు రాజేష్ విలేకర్లకు తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి సంబంధించి పలు విషయాలపై జగన్‌ ఆరా తీశారని, పార్టీ అభివృద్ధికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు.

# అమలాపురంలో 'నుయ్యి' వివాదం

- ఒక వర్గం వద్దు... మరో వర్గం కావాలంటూ వాదన
- మున్సిపాలిటీ తీసుకునే నిర్ణయంపై ఇరు వర్గాల ఎదురుచూపు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ 29వ వార్డు పరిధిలోని వనచర్ల వారి వీధిలో పూర్వం నుంచి ఉంటున్న ఓ నుయ్యి ఆ వార్డులో రెండు వర్గాల మధ్య వివాదస్పదంగా తయారైంది. మున్సిపాలిటీకి చెందిన సెంటు లోపు స్థలంలో ఉన్న ఆ నుయ్యిని ఒక వర్గం కావాలంటుంది. మరో వర్గం వద్దు అంటుంది. ఓ వర్గం ఆ నుయ్యిని వాడుతున్నారని, దానిని అలాగే ఉంచాలని ఒక వర్గం పట్టుబడుతుంటే లేదు అక్కడ నుయ్యిని తొలగించి ఆ స్థలంలో డ్వాక్రా మహిళలకు ఉపయోగ పడేలా ఓ కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తే బాటుంటుందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పుడు రెండు వర్గాలకు వివాదానికి కేంద్ర బిందువైంది. పార్టీల ప్రభావం,



వనచర్లవారి వీధిలో రెండు వర్గాల మధ్య వివాదాస్పదంగా మారిన నుయ్యి

వ్యక్తిగత ప్రతిష్ట వరకూ వివాదం వెళ్లడంతో మున్సిపాలిటీకి చెందిన ఈ స్థలంపై తీసుకునే నిర్ణయం ఎలా ఉంటుందని రెండు వర్గాలు ఉత్కంఠతో ఎదురు చూస్తున్నాయి. ఎవరికి ఉపయోగపడని నుయ్యిని తొలగించి ఈ స్థలంలో డ్వాక్రా మహిళలకు అవసరమయ్యే ఏదైనా కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని వార్డులోని మెజార్టీ ప్రజలు కోరుతున్నారని ఒక వర్గం చెబుతుంటే నుయ్యి వాడుకుంటున్నారని కొందరు అభ్యంతరం చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఆ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ తమ వార్డులో ఉన్న ఆ నుయ్యిని తొలగించి ఆ స్థలాన్ని కమ్యూనిటీ అవరాలకు ఉపయోగించుకునేలా వెసులబాటు కల్పించేందుకు ఈ అంశాన్ని కౌన్సిల్ అజెండా చేర్చాలని స్థానికుల కొందరి సంతకాలతో లిఖితపూర్వకంగా పత్రం అందజేశారు. ఈనెల 27న జరిగే కౌన్సిల్ సమావేశపు అజెండాలో ఆ అంశం చేర్చకపోవడంతో ఈ విషయం మరింత వివాదాస్పదయయ్యే అవకాశం కనిపిస్తోంది. నుయ్యి అక్కడ ఉంచాలా? లేదా? అనే అంశంపై రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తడంతో దీనిపై తగు నిర్ణయం తీసుకునేందుకు మున్సిపల్ అధికారులు కూడా వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. గత కౌన్సిల్‌లో కూడా ఈ నుయ్యి, స్థలంపై రెండు వర్గాల మధ్య వివాదం జరిగింది. అదే వివాదం ఇప్పుడు ఈ కౌన్సిల్ కూడా సాగుతోంది.

# ఎమర్జెన్సీ ఓ చీకటి ఘట్టం

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమా**

అమలాపురం టౌన్: స్వతంత్ర భారతదేశ చరిత్రలో 'ఎమర్జెన్సీ' ఓ చీకటి ఘట్టమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. బీజేపీ జిల్లా ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జన్సీపై బుధవారం జరిగిన సెమినార్‌లో వేమా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో నాడు ఎమర్జన్సీ విధించి నేటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వక్తలు తమ తమ ప్రసంగాల్లో ఆ చీకటి రోజుల్లో దేశ ప్రజలు పడ్డ అవస్థలను వివరించారు. అలనాడు ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ విధించిన ఆ పరిస్థితిపై దేశం ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులపై చర్చించింది. 9175 జూన్ 25వ తేదీ భారత హక్కులను కాలరాసిన రోజని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం చేసిన పోరాటానికి నేటితో 50 ఏళ్లు పూర్తయ్యాయని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ అన్నారు. అనంతరం అలనాటి ఎమర్జన్సీ చిత్రాలను బీజేపీ నాయకులు తిలకించారు. సెమినార్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితరులు ప్రసగించి అలనాటి ఎమర్జన్సీ వల్ల ఎదురైన కష్ట నష్టాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కొమ్ముల ధన్వంతరి నాయుడు, డాక్టర్ వీరా ధ్వనంతరి, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎమర్జెన్సీపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు

# అసిస్టెంట్ ఉద్యోగాలకు 31 మంది ఎంపిక

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 256 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 22న ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను మంగళవారం రాత్రి డీపీ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ విడుదల చేసింది. రెండు దఫాలుగా నిర్వహించిన మొదటి ఫేజ్ రాత పరీక్షలో 10,766 మంది అర్హత సాధించగా రెండో ఫేజ్‌లో తుది ఫలితాలు విడుదల చేశారు. యానాం నుంచి జనరల్ కేటగిరిలో ముత్యాల శ్రీరమ్య 93 మార్కులు సాధించి రీజియన్ ప్రథమ స్థానంలో నిలిచారు. రాజమంత్రి సతీష్‌కుమార్, యోగా సుభాకర్ బాబు, కల్లూరి సాయి మోహన ప్రకాష్, మట్టపర్తి లక్ష్మీ నారాయణ, మహ్మద్‌షారూఖ్, ఎస్సీ విభాగం నుంచి నక్కా చైతన్య, జగడం సునీల్‌కుమార్, మెల్లం శరత్ రాజ్, ఇడబ్ల్యుఎస్ నుంచి పేరాబత్తుల వీరబాబు, రాయపురెడ్డి దుర్గా గౌరీ ప్రవంతి, యనుమల ప్రశాంత్‌నోయల్, పేపకాయల సాయిపవన్ సుధీర్, గీదా భాగ్యలక్ష్మీ సాయి, గీదా హరిహరరత్నం, చింతలపూడి నాగ ధనుష్, సీహెచ్ సత్యసూర్య, గీదా సూర్య వీరసాయి, సాలగ్రామ శ్రీవెంకటే శ్వర్లు, సీహెచ్ వంశీసాయికృష్ణ, తలాటం అభిషేక్, వెంట్రపాటి శ్రీసాయి గోవింద్, కల్లూరి శేషసాయిమాధవ్, చోడిశెట్టి మౌనిక, పల్లా దుర్గాప్రసాద్, రెడ్నం శ్రీకాంత్, పెన్నాడ సాయి అఖిల్, యడ్ల ధరణి, కనకాల లక్ష్మీప్రియాంక, కనకాల సాయి వెంకటబాబా మనోజ్, కామిరెడ్డి సత్యసాయి ఎంపికయ్యారు. వీరికి త్వరలోనే ధ్రువీకరణపత్రాల పరిశీలన, అనంతరం పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. 9 మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. యానాం రీజియన్ నుంచి అత్యధికంగా అభ్యర్థులు ఎంపిక కావడంతో వారి తల్లిదండ్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# డ్రైన్లలో పూడిక తీతకు చర్యలు

**మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్**

అమలాపురం టౌన్: పట్టణంలో నెలకొన్న పారిశుధ్య, తాగునీటి, వీధి దీపాల సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ వాటి పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. పట్టణంలోని 2, 3, 4 వార్డుల్లో ఆయన తన సిబ్బందితో బుధవారం ఉదయం పర్యటించి పలు సమస్యలను స్వయంగా గుర్తించారు. ముఖ్యంగా డ్రైన్లలో పూడిక తీతలు ఉన్నట్టు ఆయన గుర్తించారు. డ్రైన్స్ అవుట్ లెట్స్ వద్ద పూడికలు బాగా పేరుకుపోయి మురికి నీటి ప్రవాహానికి అవరోధం ఏర్పడుతున్నట్టు గమనించారు. దీంతో వెంటనే పూడికల తీతకు చర్యలు చేపట్టాలని కమిషనర్ నిర్మల్ కుమార్ తన వెంట ఉన్న కౌన్సిలర్లకు వివరించారు. ఆలాగే వీధి దీపాలు కొన్ని చోట్ల వెలగని పరిస్థితులపై ఆయన స్పందించారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెలో ఉన్న కారణంగా వీధి దీపాల సమస్య కొంత వరకూ అనివార్యమవుతోందని, అయినప్పటికీ వీధి దీపాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ ఏఈ కృష్ణను కమిషనర్ ఆదేశించారు. తాగునీటి సమస్యలు పలు చోట్ల కనిపించినప్పటికీ ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కమిషనర్ నిర్మల్‌కుమార్ వెంట డీఈఈ కె.సత్యనారాయణ, ఏఈలు సూర్య భాస్కరరావు, వెంకటేష్, కృష్ణ, కౌన్సిలర్ ఏడిద శ్రీను, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

## సమస్యలను పరిష్కరించండి

**హోంమంత్రి నమశ్శివాయంతో ఎమ్మెల్యే అశోక్**



హోమ్ మంత్రి నమశ్శివాయంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పుదుచ్చేరి హోమ్ మంత్రి నమశ్శివాయంకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొన్నేళ్లుగా యానాంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గెస్ట్ టీచర్లుగా, పారా టీచర్లుగా పనిచేస్తున్న వారి సేవలను రెన్యువల్ చేయాలని అదేవిధంగా పర్మినెంట్ సైతం చేయాలని కోరారు. పుదుచ్చేరి స్టేట్ స్పోర్ట్స్ డెవలెప్‌మెంట్ అథారిటీలో కోచ్‌ల నియామకం చేయాలని ప్రస్తుతం చేస్తున్న వాళ్లను రెగ్యులర్ చేయాలని కోరారు. డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని వారికి న్యాయం చేయాలని కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యానాంలో పలు కీలక ప్రాంతాల్లో సీసీ కెమేరాలు అమర్చాలని కోరారు.

# ఆవుకు శస్త్ర చికిత్స

**గర్భసంచి సమస్యను నయం చేసిన పశు వైద్యులు**

అమలాపురం టౌన్: పట్టణంలోని వడ్డిగూడెంలో ఓ ఆవు గర్భసంచి సమస్యతో పెద్ద ప్రేగు వెలుపలకు వచ్చి లేవలేని పరిస్థితుల్లో ప్రమాదకరంగా అవస్థలు పడుతోంది. దీనిపై స్థానికుల స్పందించి పశు అంబులెన్స్ ×1962॥ కు ఫోన్ చేసి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి వైద్య సిబ్బందితో వచ్చి ఆవుకు శస్త్ర చికిత్స చేశారు. వెలుపలకు వచ్చిన పెద్ద ప్రేగును లోనికి పంపించి గర్భసంచిని సరిచేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆవుకు తక్షణమే అత్యవసర వైద్యం అందించారు. అది రెండు రోజుల్లో కోలుకుంటుందని డాక్టర్ విజయరెడ్డి చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆవు నెమ్మదిగా లేచి తన దూడకు పాలు ఇవ్వడంతో స్థానికులు సంతోషించారు. వైద్యునితో పాటు పశు వైద్యాధికారులు డాక్టర్ ఎం.నారాయణ రావు, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హెప్సిబా, డాక్టర్ శివ తేజ ఉన్నారు. పశు ప్రేమికులు జి.శ్రీనివాస్, చిన్నబాబు తదితరులు ఆవుకు అత్యవసర శస్త్ర చికిత్స చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన పశు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



శస్త్ర చికిత్స అనంతరం తన దూడకు పాలిస్తున్న ఆవు. చిత్రంలో పశు వైద్యులు

# ఉత్సాహంగా జోనల్ స్కూల్ గేమ్స్



బహుమతులు అందుకున్న విజేతలైన బాలికలు

యానాం: స్థానిక జోనల్ స్కూల్ గేమ్స్ బుధవారం ఉత్సాహంగా జరిగాయి. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో అండర్–14 బాలికలు, బాలుర విభాగాల్లో టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ఎంజీజీబీహెచ్ స్కూల్ ప్రథమ, రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హైస్కూల్ ద్వితీయ, యానాం పబ్లిక్ స్కూల్ తృతీయ స్థానాన్ని సాధించారు. అండర్–17లో బాలుర విభాగంలో రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రథమ, రాజీవ్ గాంధీ హైస్కూల్ ద్వితీయ, ఎంజీజీబీహెచ్ స్కూల్ తృతీయస్థానం సాధించారు. అండర్–14 బాలికల విభాగంలో గిరియాంపేట పెరుంతలైవార్, దరియాలతిప్ప హైస్కూల్, కనకాలపేట హైస్కూల్ జట్లు విజయం సాధించాయి. అండర్–17 బాలికల విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హైస్కూల్ పరంపేట జట్టు ప్రథమ, డాక్టర్ కేఆర్ నారాయణన్ హైస్కూల్ దరియాలతిప్ప ద్వితీయ, ఎస్టీటీపీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించాయి. అనంతరం బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి సన్యాసిరావు, పీఈటీలు పాము సత్యనారాయణ, భాస్కర్, మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

**యువకులకు ట్రాఫిక్ ఎస్సై ఏడుకొండలు కౌన్సెలింగ్**

అమలాపురం టౌన్: మోటారు సైకిల్ నడుపుతున్నప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, అతి వేగం వద్దని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఎం.ఏసుబాబు తెలిపారు. ఆయన హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న యువకులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక ఈదరపల్లి వంతెన వద్ద హెల్మెట్ లేకుండా బైక్ డ్రైవింగ్‌తో వేగంగా వెళుతున్న కొంత మంది యువకులను ఎస్సై ఆపి వారితో మాట్లాడారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రయాణం చేయకూడదన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు ఆదేశాలతో ప్రతి రోజు అమలాపురం పట్టణంలో ఏదో కూడలిలో ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నామని ఎస్సై ఏసుబాబు తెలిపారు. ముఖ్యంగా బైక్‌లు నడుపుతున్న యువకులకు కౌన్సిలింగ్‌లు ఇచ్చి వారిలో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.



అమలాపురంలో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఏడుకొండలు

# నీరు సాగేదెలా...?

**పంట కాలువలో పేరుకుపోయిన గుర్రెపు డెక్క**

అమలాపురం టౌన్: పట్టణంలో విత్తనాల వారి కాలువ గుర్రెపుడెక్క పేరుకుపోయింది. దాదాపు మూడు కిలోమీటర్లు ఉన్న ఈ కాలువ అటు అమలాపురం రూరల్, ఇటు అల్లవరం మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందిస్తుంది. ఈ పంట కాలువలో పట్టణంలోని విత్తనాల వారి కాలువ నుంచి అబ్బిరెడ్డి వీధి వరకూ అది కాలువలో లేదా పచ్చదనం పరుచుకున్న తోవో తెలియనంతగా గుర్రెపు డెక్క అలుముకుంది. దీంతో కాలువ ప్రవాహ వేగంగా తగ్గింది. ఇలా ఉంటే పంట పొలాలకు సాగునీరు ఎలా అందుతుందని ఆ కాలువ వెంబడి ఉన్న రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులకు పెద్ద పీట వేస్తున్నామని మాది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటోంది. మా విత్తనాల వారి కాలువపై అలుముకున్న గుర్రెపు డెక్కను తొలగించి కాలువ ప్రవాహ, సాగు సమస్యలు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



విత్తనాల వారి కాలువలో పేరుకుపోయిన గుర్రెపు డెక్క